# నా(రీ)పథం

శ్రీకాంత్ యజ్ఞమూర్తి

ఎమెస్కో

# నా(రీ)పథం

అమెరికాకు ఫ్లైట్ ఎక్కబోతున్న సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు విశ్వం. పగలంతా టాక్సీలో ప్రయాణం చేసిన అలసటను కూడా లెక్కచేయకుండా, హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ డిపార్చర్స్ దగ్గర ముందుకేమాత్రం కదలకూడదని మొరాయించి మూడు లైన్లలో వున్న వాహనాల్ని చూసి దీర్ఘంగా నిట్టూర్పు వదుల్తూ, వెనక ముందూ పొయ్యే వాహనాల్ని కారు కిటికీలోనుంచే కళ్ళతోనే తోసెయ్యాలన్నంత కసితో చూస్తున్నాడు. భార్య, డ్రైవర్ వద్దని వారిస్తున్నా, చేతుల్తో, సైగలతో, వచ్చిరాని ఉర్దూతో, పక్కనెళ్తున్న వాహనాలకి డైరెక్షన్లు ఇస్తూ, ఈస్ క్రీమ్ అందుకొనే ఆరాటంతో ఉన్న క్యూలో నుంచున్న చిన్నపిల్లాడిలా, ఎప్పుడెప్పుడు ఆగుదామా, బ్యాగేజి దించుదామా అని సీటుమీదనుంచి అరంగుళం పైనే లేచినించునే ఉన్నాడు. తన ఖర్మకాలి ప్రతి ఒక్క వెహికల్ వాడు ఇసుమంత సందుదొరికితే రివ్వు మని దూర్చేస్తున్నారు. ఈ డ్రైవరుకేమో సిటీ కొత్తయే, దూర్చేటి నైపుణ్యం కరువాయె. విశ్వానికి ఓ కన్ను బయటున్న ఓ కన్ను డ్రైవర్ మీదే వుంది. స్టీరింగ్ అందిబుచ్చుకొని, తనే ముందుకు ఎత్తుకెళ్ళి డిపార్చర్స్ దగ్గర పెట్టాలనేంతగా విసుక్కొంటూ 'కృష్ణా, యీ లెక్కన మా ప్రయాణం అటకెక్కేటట్టే వుంది. ఆ పేరు పెట్టుకున్నందుకన్నా నీ రథాన్ని పోనీవయ్యా' అన్నాడు.

"సార్, వీళ్ళ దూకుడు చూస్తోంటే, నా బుర్ర గిర్రుమని తిరుగుతోంది, రివర్స్‌లో వెనక్కి వెళ్లి పోవాలనుంది. మీరే కొంచెం ముందు బయల్దేరాల్సింది" అన్నాడు కృష్ణ.

"సరే మాట్లాడకు గాని, ముందుకు పోనివ్వు", విసుక్కుంటూ అన్నాడు విశ్వం

భర్త విసుగుకు, డ్రైవర్ చేతకానితనానికి మధ్యవర్తిత్వం వహిస్తూ పార్వతి 'పోనివ్వండి, ఇంకెంత సేపు, దగ్గరగా చేరాము కదా, మహా అంటే ఇంకో పది నిముషాలు' అంది.

“పదినిముషాలో, అరగంటో, సిటీ నుంచీ లోకల్ టాక్సీ తీసుకోవాల్సి ఉండేది. ఎవడు కలగన్నాడు ఇంత లేటైతుందని” అన్నాడు విశ్వం.

“ఎందుకు సార్ అంత తొందర పడుతారు, ఆ ప్లేను కాకపోతే ఇంకోటాయే” అన్నాడు కృష్ణ.

విశ్వానికి తిక్కరేగింది “నీ వెర్రి తగలడా, ఈ టిక్కెట్టు కొనడానికే తలప్రాణం తోకకొచ్చింది, ఇంకోటి కొనాలంటే చచ్చి వూరుకుండటమే. ఇంటర్నేషనల్ ఫ్లైటుకు మూడుగంటల ముందువుండాలంటారు. ఇంకొక్క అయిదు నిముషాలకు అదికూడా అయిపోతుంది. అక్కడ వాళ్ళదగ్గర వెళ్లి బిచ్చమెత్తాలి”.

“ఏమి మాటలండీ, ఏదో ఫ్లైట్ ఎక్కలేకపోతే ప్రాణం పోయినట్టు. వెళ్లకపోతే తిరిగి వెనక్కి వెళ్తాం, అంతే కానీ, కానిమాటలు ఎందుకు?” అంది పార్వతి.

“అంత తేలిగ్గా మాట్లాడుతావే. నీకు తెలీదా, దీనికోసం నేనెంత కష్టపడ్డది” అన్నాడు విశ్వం.

“మరి, అన్ని మనచేతుల్లో ఉంటాయా ఏమిటి”

“అంటే, చేతిలోవుండేదాన్ని జారబుచ్చుకోమంటావా”

“మన యోగముంటే వెళ్తాం, అంతేకాని దానికోసం బీపీలు, షుగర్లు పెంచుకోవడమెందుకు”

“సరేలే, నాకన్ని చెప్పొచ్చావు కానీ, జరిగేపని చూడాలికదా. ఈ టాక్సీ ఒకటి. చీమలాగూడా కదలడం లేదు. కృష్ణా, నువ్వు తొందరగా పోనిచ్చావంటే నీకింకొక రెండొందలు ఎక్స్ ట్రా ఇస్తాను”

“సార్, డబ్బు ఎవరికి చేదుకాని ఎవడినైనా గుద్దానంటే, నేను తిన్నదానికంటే ఎక్కువ కక్కాల్సి వస్తుంది” అన్నాడు కృష్ణ.

“అరె, ఏంటా శబ్దము వెనకనుండీ, ఎవడో గుద్దినట్టుంది. ఎందుకాపావు, అందరూ స్పీడ్ తో వెళ్తుంటే నువ్వు స్లోగా వెళ్తే ఇదే ఇబ్బంది”

“నాకొంప ముంచారు సర్. డ్రైవింగ్ చేస్తుండే వాణ్ణి ఒకటే సతాయిస్తున్నారు. ఇప్పుడు ఏమి తగిలిందో, మా ఓనర్ తో ఏమి చివాట్లు పడాలో. కారు పక్కకు పెట్టి చూడనీ” అన్నాడు కృష్ణ.